సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 26 । జూన్ । 2023



సాగుకు సై
గిరిజన రైతులు సాగుబాట పట్టారు. విస్తారంగా వర్షాలు పడుతుండటంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. 8లో



వెదురు బొంగుల అక్రమ రవాణా
మారేడుమిల్లి అటవీ ప్రాంతం నుంచి వెదురు బొంగులు భారీ స్థాయిలో అక్రమంగా తరలిపోతున్నాయి. 8లో




చేరువైన దూరవిద్య
ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని దూరవిద్య కేంద్రం సేవలను విద్యార్థులకు మరింత చేరువ చేసింది. 8లో

జలం.. పుష్కలం

రంపచోడవరం డివిజన్‌లో జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. వర్షాలు నెలరోజులు ఆలస్యమైనా వారం రోజులుగా సమృద్ధిగా కురుస్తున్నాయి. సాగునీటి సమస్య తప్పదని అన్నదాత భావిస్తున్న తరుణంలో వరుణుడు కరుణించాడు.

- కరుణించిన వరుణుడు
- ఐదు రోజులుగా విస్తారంగా వర్షాలు
- నిండుతున్న జలాశయాలు
- ఖరీఫ్ అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు



నిండుగా భూపతిపాలెం జలాశయం

రంపచోడవరం: గత వారం రోజులుగా ఏజెన్సీలో వర్షాలు కురవడంతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌కు ప్రాజెక్టు దిగువన ఉన్న సాగు భూములకు నీటికి కొరత లేనట్టే. వర్షాలు పడకపోయినా ఖరీఫ్ సీజన్ మొత్తానికి ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు అందించే పరిస్థితి ఉంది.

- ఏజెన్సీలోని ముసురుమిల్లి, భూపతిపాలెం, సూరంపాలెం, మద్దిగెడ్డ ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయి. ప్రాజెక్టుల్లో ఎఫ్ఆర్ఎల్ (పూర్తిస్థాయి నీటి మట్టం)కు సమానంగా నీరు చేరింది. నీటి నిల్వలు అందుబాటులో ఉండటంతో గిరి రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులకు అవసరమైన విత్తనాలును వ్యవసాయ శాఖ ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేపట్టింది.

నిండుగా సీతపల్లి వాగు

సీతపల్లి వాగు నిండుగా ప్రవహిస్తోంది. భూపతిపాలెం, ముసురుమిల్లి ప్రాజెక్టులకు ఈ వాగు నీరే ఆధారం. రంపచోడవరం మండలంలోని భూపతిపాలెం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 204 మీటర్లు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు 203 మీటర్లకు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 0.645 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.638 టీఎంసీల మేర నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుపై ఖరీఫ్‌లో సుమారు 5 వేల ఎకరాలు ఆధారపడ్డాయి. రంపచోడవరం మండలంలో 20 గ్రామాల రైతుల్లో ఆనందం నెలకొంది.

10 వేల ఎకరాలకు..

గంగవరం మండలంలోని సుమారు 15 గ్రామాలకు పైగా సూరంపాలెం ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్‌కు పది వేలకు సాగు నీరు ఇచ్చేందుకు ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


- ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ 105 మీటర్లు కాగా ప్రస్తుతం 101.90 మీటర్లు నీటి మట్టం ఉంది. మరో మూడు మీటర్లు పెరిగితే పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుంది. ఈ ప్రాజెక్టు ద్వారా గంగవరం, గోకవరం మండలాల్లో రైతులకు సాగునీరు అందిస్తున్నారు. ప్రస్తుతం గేట్లు మూసి ముంచారు.

నాలుగు మండలాలకు..

ఏజెన్సీలో ముసురుమిల్లి ప్రాజెక్టు ద్వారా రంపచోడవరం, దేవీపట్నం, గోకవరం, కోరుకొండ మండలాల్లోని 22 వేల ఎకరాలకు సాగు అందుతుంది. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 113 మీటర్ల మేర 0.38 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ముసురుమిల్లి ప్రాజెక్టు నిర్మాణం 90 శాతం పూర్తి కాగా పది శాతం పనులు పూర్తి కావాల్సి ఉంది. ఒకటి రెండు గేట్ల ఏర్పాటుతో ప్రాజెక్టు పనులు పూర్తయినట్లే. ప్రాజెక్టు పూర్తయితే ఎఫ్ఆర్ఎల్ 123 మీటర్ల వరకు ఉంటుంది. అలాగే 1.6 టీఎంసీల నీటిని ప్రాజెక్టులో నిల్వ చేయవచ్చు.

మద్దిగెడ్డలో సమృద్ధిగా..

అడ్డతీగల మండలంలోని మద్దిగెడ్డ రిజర్వాయర్ ద్వారా ఖరీఫ్‌లో నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చేందుకు నీటి నిల్వలు ఉన్నాయి. రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్ 188 మీటర్లు కాగా ప్రస్తుతం 185.20 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి.



సూరంపాలెం జలాశయం

జలాశయాల వివరాలు

ప్రాజెక్టు	పూర్తిస్థాయి నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం	ఆయకట్టు
భూపతిపాలెం	204 మీటర్లు	203 మీటర్లు	5 వేల ఎకరాలు
సూరంపాలెం	105 మీటర్లు	101.90 మీటర్లు	10 వేల ఎకరాలు
ముసురుమిల్లి	123 మీటర్లు	113 మీటర్లు	22 వేల ఎకరాలు
మద్దిగెడ్డ	188 మీటర్లు	185.20 మీటర్లు	4 వేల ఎకరాలు



మద్దిగెడ్డ జలాశయం

న్యూస్‌రీల్

బొప్పాయి కాదు పనస కాయలు



గడికించుమండలో విరగ్గాసిన పనసకాయలు

సాక్షి,పాడేరు: బొప్పాయి మాదిరిగా విరగ్గాసిన పనసచెట్టు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.. హుకుంపేట మండలంలోని గడికించుమండ గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే పనసచెట్టుకు కాపు అధికంగా ఉంది. ఒకే కాండానికి 44వరకు ఉన్న పనసకాయలు అబ్బుర పరుస్తున్నాయి.

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవాలు ప్రారంభం



మోదమ్మ పాదాలు, ఘటాలను మోస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు,గ్రామపెద్దలు

సాక్షి,పాడేరు: మన్యప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మతల్లి ఉత్సవాలు పంచాయతీ కేంద్రమైన గుత్తులపుట్టు గ్రామంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే మోదకొండమ్మ ఉత్సవ విగ్రహం, ఇత్తడి పాదాలు, ఘటాలను అమ్మవారి ఆలయం నుంచి గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులంతా భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. సతకంపట్టు వద్ద వాటిని ప్రతిష్టించి, మూడు రోజుల జాతరకు శ్రీకారం చుట్టారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈనెల 27వతేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి.అదే రోజు సాయంత్రం అమ్మవారి అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని సర్పంచ్ సాగెని బాబూరావుపడాల్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోడూరు వెంకటరెడ్డి, కేజేపురం పీహెచ్‌సీ వైద్యుడు కిముడు లీలాప్రసాద్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వచ్చిన మహిళలు

అడ్డతీగల: వేటమామిడి శివారున వెలసిన ఊడల మర్రి రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి బోనాల సమర్పణ పండుగ ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజామునే రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు ముర్ల రాజారెడ్డి ప్రత్యేక పూజాధికాలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాలు సమర్పణ తరువాత అమ్మవారికి పూజాధికాలు జరిపారు. అనంతరం చిన్న మస్తాదేవికి హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

వీఆర్పీ ఆకస్మిక మృతి

- గుండెపోటుగా భావిస్తున్న వైద్యులు
- పలువురి సంతాపం



వెంకటలక్ష్మి భౌతికకాయం

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం-2 ఉపాధిహామీ వీఆర్పీ పొట్టిక వెంకటలక్ష్మి(25) ఆకస్మికంగా మరణించారు. శనివారం రాత్రి ఆమె అస్వస్థతకు గురయ్యారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న ఆమె నిద్రలోనే ప్రాణాలు విడిచారు. ఆమెకు ఇద్దరు సంతానం. వెంకటలక్ష్మి రక్తహీనతతో బాధపడుతున్నందున బలమైన ఆహారం తీసుకోవడంతో పాటు ఎక్కువ విశ్రాంతి తీసుకోవాలని గతంలో సూచించామని వైద్యులు తెలిపారు. ఆమె మృతికి గుండెపోటు కారణం కావచ్చని రాజేంద్రపాలెం వైద్యులు సంపత్‌బాబు తెలిపారు. ఆమె మృతి పట్ల ఏపీవో రాజు,రాజేంద్రపాలెం వీఆర్పీ బల్లా ప్రసాద్ సంతాపం తెలిపారు. వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నేడు ఆరోగ్యశాఖ మంత్రి పర్యటన

సాక్షి,పాడేరు: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని సోమవారం పాడేరులో పర్యటిస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ముందుగా స్థానిక మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం అధికారిక కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారన్నారు. పాడేరులో వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తారని తెలిపారు. పాడేరులో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు నిర్మించిన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆమె ప్రారంభిస్తారన్నారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆమె కోరారు. పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొని మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

బొర్రాకు పర్యాటకుల తాకిడి



అనంతగిరి: మండలంలోని ప్రముఖపర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు ఆదివారం పోటెత్తారు. గతవారం రోజులుగా అంతంతమాత్రంగానే పర్యాటకులు తాకిడి ఉండగా, ఆదివారం 1700 మంది బొర్రాగుహలను తిలకించారు. సుమారు రూ.1.33 లక్షల మేర ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. డముకు వ్యూపాయింట్, కటికి, తాటిగుడ, సరియా, కాఫీ ప్లాంటేషన్ తదితర సందర్శిత ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి.

పాడేరు చేరుకున్న ఎన్నికల సామగ్రి

- స్ట్రాంగ్ రూమ్‌కు వీవీ పాట్స్ తరలింపు
- కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు



కంటైనర్ నుంచి దింపుతున్న వీవీ పాట్స్



స్ట్రాంగ్ రూంలో వీవీ పాట్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్,ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సామగ్రి ఆదివారం పాడేరు చేరుకుంది. మూడు కంటైనర్లలో వచ్చిన 3100 వీవీ పాట్స్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షణలో జేసీ శివశ్రీనివాస్, డీఆర్వో అంబేద్కర్ స్థానిక డిగ్రీ కళాశాల భవనంలోని ఈవీఎం వేర్ హౌస్‌లో పలు రాజకీయ పార్టీల నేతల సమక్షంలో భద్రపరిచారు. వీవీపాట్స్‌ను తీసుకువచ్చేందుకు ప్రత్యేక ఉప కలెక్టర్ వి.వి.ఎస్.శర్మ, పాడేరు తహసీల్దార్ వి. త్రినాథరావునాయుడు మూడు రోజుల క్రితం బెంగళూరు వెళ్లారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీ నుంచి వీటిని ఆదివారం ఉదయం తీసుకువచ్చారు. జిల్లాలోని అరకులోయ, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల పరిధిలో 1085 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన వీవీ పాట్స్‌ను భారత ఎన్నికల సంఘం పంపినట్టు కలెక్టర్ వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు, ఇతర సామగ్రి ఆగస్టులో చేరనున్నాయని జేసీ శివశ్రీనివాస్ పేర్కొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత

ఈవీఎం వేర్ హౌస్‌లో భద్రపరిచిన వీవీ పాట్స్‌కు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. 24గంటలూ పోలీసు బలగాలతో భద్రత ఏర్పాటు చేయడంతోపాటు భవనం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ఆయన ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ, బీజేపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం , బీఎస్పీ పార్టీల నేతలు పాల్గొన్నారు.

చురుగ్గా ఎకో పల్పింగ్ యూనిట్ పనులు

జీకేవీధిలో సీజన్ నాటికి అందుబాటులోకి రానున్న యంత్రాలు



పల్పింగ్ యంత్రాలు



గూడెంకొత్తవీధిలో నిర్మిస్తున్న ఎకో పల్పింగ్ యూనిట్

గూడెంకొత్తవీధి: మండలంలో ఎకో పల్పింగ్ యూనిట్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మూడేళ్ల క్రితం పాడేరు ఐటీడీఏ అధికారులు చింతపల్లిలో ప్రయోగాత్మకంగా రూ.4 కోట్లతో ఏర్పాటు చేసిన ఎకో పల్పింగ్ యూనిట్ వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. దీనిని దృష్టిలోపెట్టుకుని గూడెంకొత్తవీధి మండలంలో ఎకో పల్పింగ్ యూనిట్‌కు సంబంధించిన భవనాలను రూ.40 లక్షలతో నిరిస్తున్నారు. మరో రూ.4 కోట్లతో యంత్ర సామగ్రి ఏర్పాటుచేయనున్నారు. చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్లో అత్యాధునిక యంత్రం ద్వారా గంటకు 5 టన్నుల కాఫీ పండ్లను పల్పింగ్ చేస్తున్నారు. ఇక్కడ శుద్ధి చేసిన కాఫీని అంతర్జాతీయ మార్కెట్ ధరలకు విక్రయించి ఆ మొత్తాన్ని రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. రవాణా, ఇతర ఖర్చులు కొద్ది మొత్తంలో రైతులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ కృషి ఫలిస్తున్న తరుణంలో కాఫీ అధికంగా సాగు చేస్తున్న అన్ని మండలాల్లో భవిష్యత్తులో ఈ యూనిట్లను ఏర్పాటుచేయాలని ఐటీడీఏ భావిస్తోంది. ఏజెన్సీ వ్యాప్తంగా సుమారు 2.20 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు ఉన్నాయి. సుమారు రెండు లక్షలకు పైగా రైతులు 1.58 లక్షల ఎకరాల తోటల ద్వారా ఫలసాయం పొందుతున్నారు. కాఫీ సీజన్ ప్రారంభం నాటికి యూనిట్ సేవలు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ జేఈ రఘునాథరావు నాయుడు తెలిపారు.

గంజాయి రవాణా గుట్టురట్టు



పాడేరు ఘాట్‌లో ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు



కారులో లభ్యమైన గంజాయి ప్యాకెట్లు

- ట్యాంకర్‌ను కారు ఢీకొనడంతో వెలుగుచూసిన వైనం
- డ్రైవర్ పరార్
- రూ.400 కిలోలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సాక్షి,పాడేరు: గంజాయి రవాణా గుట్టురట్టయింది. కారులో తరలిస్తుండగా బట్టబయలైంది. వివరాలిలా ఉన్నాయి. పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడి సమీపంలోని ఓ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను అతివేగంతో వేస్తున్న కారు ఆదివారం ఉదయం ఢీకొట్టింది. ఈ ఘటనతో కారులో తరలిస్తున్న గంజాయి వెలుగు చూసింది. ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టడంతో కారు అక్కడే ఆగిపోయింది. కారును స్టార్ట్ చేసేందుకు డ్రైవర్ విశ్వప్రయత్నం చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో కారును వదిలి పరారయ్యాడు. ట్యాంకర్ డ్రైవర్ సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ రంజిత్‌కుమార్ సంఘటన స్థలానికి వెళ్లారు. కారు డోర్‌ను తెరిచి చూసేసరికి 400 కిలోల గంజాయి బయటపడింది. కారు రిజిస్ట్రేషన్ నంబరు ఆధారంగా మహారాష్ట్రకు చెందినదిగా గుర్తించామని ఆయన వివరించారు. గంజాయిని స్వాధీనం చేసుకొని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మినీ జాబ్‌మేళా రేపు

అనకాపల్లిటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న మినీజాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ వరకూ చదువుకున్న 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7036363272 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పుష్పయాగానికి పూలు తరలింపు



వివిధ రకాల పుష్పాలకు సంకల్పం చేస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ (విశాఖ): తిరుమల శ్రీ గోవిందరాజ స్వామి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలి వెళ్లాయి. కార్తీక దినోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన పూలు యాగానికి పంపించారు. ఆదివారం ఉదయం ఎంవీపీలోని టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ వద్ద ఈ పూలను ప్రదర్శించారు. తొలుత మహిళా భక్తులు పూలను అందంగా తీర్చిదిద్ది ప్యాకింగ్ చేశారు. అనంతరం సంకల్పం చేసి శాస్త్రోక్తంగా పుష్పయాగం కోసం తిరుమలకు ఈ పూలు తరలించారు. వీటిలో కలువలు, తామరలు, తులసి, మల్లి, జాజి, సంపంగ ఇలా వివిధ రకాలకు చెందిన పూలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ, అధ్యాత్మికవేత్త సత్యకుమార్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ముగిసిన ఎంపిక



తలారిసింగి మైదానంలో ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

సాక్షి,పాడేరు: కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4,5 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జిల్లా స్థాయిలో చేపట్టిన ఎంపిక కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. స్థానిక తలారిసింగి పాఠశాల క్రీడా మైదానంలో గత మూడు రోజుల నుంచి విద్యార్థులకు పలు అంశాల్లో పరీక్షలు నిర్వహించారు. క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు 100 మందిని జిల్లాస్థాయి పరీక్షలకు ఎంపిక చేశారు. వీరిందరికి దేహదారుఢ్య పరీక్షలతోపాటు పరుగు పందెలు, పలు క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థిని, విద్యార్థుల తుది జాబితాను త్వరలో ప్రకటిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహనరావు తెలిపారు. మరిన్ని వివరాలకు 9000274225 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు. ఎంపిక కార్యక్రమాల్లో తలారిసింగి పాఠశాల హెచ్ఎం రీమలి జాన్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సూరిబాబు పాల్గొన్నారు.

'కార్గో' ఆదాయం రోజుకు రూ.20 లక్షలు

ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు అప్పలనాయుడు



అధికారులు, స్థానికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

యలమంచిలి: ఆర్టీసీ కార్గో సేవల ద్వారా ఉత్తరాంధ్రలో రోజుకు రూ.20 లక్షల చొప్పున ఆదాయం వస్తోందని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.ఎ.అప్పలనాయుడు తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పార్శిల్ సర్వీస్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మట్లాడుతూ పలాస నుంచి పాయకరావుపేట వరకు 45 పార్శిల్ సర్వీస్ కేంద్రాలు, 65 ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా రోజుకు సుమారు రూ.20 లక్షల ఆదాయం సమకూరుతోందని తెలిపారు. కార్గో సేవలను మరింతగా విస్తృతపరిచి రూ.30 లక్షల వరకూ ఆదాయం వచ్చేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీకి ప్రయాణికుల ద్వారా 70 శాతం ఆక్యుపెన్సీ ఆదాయం వస్తోందని తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రూ.30 లక్షలతో డ్రైవర్లకు విశ్రాంతి భవనాన్ని నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు చెప్పారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు యలమంచిలి పట్టణంలో కాంప్లెక్స్‌కి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాంప్లెక్స్‌లో ఖాళీగా దుకాణాలను లీజు ప్రాతిపదికన ఇచ్చేందుకు ఇప్పటికే టెండర్లు ఆహ్వానించామని, కావల్సిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అంతకు ముందు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిర్మాణంలో ఉన్న నూతన గృహ సముదాయాన్ని ఆయన పరిశీలించారు. ప్రయాణికులు, స్థానికులతో మాట్లాడి ఆర్టీసీ సేవలు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.

తాండవ నదిలో ఇసుక తవ్వకాలు



తాండవ నదిలో ఇసుకతో ట్రాక్టర్



ఆడాకుల-కిష్టారం మధ్య నిల్వ చేసిన ఇసుక

- జోరుగా అక్రమ రవాణా
- చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు

కొయ్యూరు: మండలంలో ఆడాకుల, కిష్టారం ప్రాంతాల్లోని తాండవ నది గర్భంలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున ఇక్కడి నుంచి నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ మండలాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆ తవ్వకాల వెనుక ఆడాకుల ప్రాంతీయులు కీలకపాత్ర పోషిస్తున్నారు. గొలుగొండ మండలం యల్లవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇసుక మార్కెటింగ్‌ను పర్యవేక్షిస్తున్నారు. నర్సీపట్నం, నాతవరం, గొలుగొండలో ట్రాక్టర్ ఇసుకను సుమారు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఆడాకుల పరిసర ప్రాంతాల్లో అయితే రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు సూచిస్తున్నారు. దీనిపై కొయ్యూరు స్వామినాయుడును వివరణ కోరగా ఇసుక రవాణాపై నిఘా ఏర్పాటుచేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ తిరుమలరావు దృష్టికి ఇసుక రవాణా విషయాన్ని తీసుకువెళ్లగా ఇసుక తవ్వకాలు అనుమతులు లేవన్నారు. సిబ్బందిని అప్రమత్తం చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

వామనావతారంలో జగన్నాథుడు

డాబాగార్డెన్స్ (విశాఖ): జగన్నాథుడి రథోత్సవాలు నగరంలో కనులపండువగా జరుగుతున్నాయి. టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కొలువుదీరిన స్వామి ఆదివారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజలు, లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలు, సాయంత్రం 5 నుంచి 6 వరకు నేవల్ డాక్‌యార్డ్ బృందంచే విష్ణుసహస్రనామ పారాయణ, గోవిందనామ సంకీర్తన, హనుమాన్ చాలీసా నిర్వహించారు.



బలభద్రుడు, సుభద్రతో జగన్నాథుడు

క్లుప్తంగా

వెదురు బొంగుల అక్రమ రవాణా

మారేడుమిల్లి: మారేడుమిల్లి అటవీ ప్రాంతం నుంచి వెదురు బొంగులు అక్రమంగా తరలి పోతున్నాయి. ఈ ప్రాంతంలోని వెదురు బొంగులు ప్రత్యేకత ఉన్నందున వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వీటిని పట్టణాలకు తరలించి కొంతమంది అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి వెదురు బొంగుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్కూటీపై వెళుతున్న వ్యక్తిని పల్సర్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొనడంతో వెదురువాడకు చెందిన పుర్రె ధోనీ (17) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో కుమార్తె మృతి, తండ్రికి గాయాలు

కశింకోట : కశింకోట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తె మృతి చెందగా, తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ ఎ.ఆది నారాయణరెడ్డి అందించిన వివరాలివి. నాతవరం మండలం గుమ్మడిగుండ గ్రామం నుంచి విశాఖ వైపు వేగంగా వెళుతున్న స్కూటీ మార్గమధ్యంలో కశింకోట వద్ద అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో స్కూటీ నడుపుతున్న విశాఖలోని విశాలాక్షినగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి బల్లంకి నాగేశ్వరరావు, వెనుక కూర్చున్న కుమార్తె అల్లవరపు నాగ సత్యవతి (26) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యవతి మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. కుమార్తె ఇంటికి చుట్టపు చూపుగా వచ్చిన నాగేశ్వరరావు తిరిగి విశాఖ వెళ్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. నాగేశ్వరరావు కుమారుడు నానిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలు గృహిణి. ఆమెకు ఐదేళ్ల కుమార్తె అభిశ్రీ, ఏడేళ్ల కుమారుడు యువతేజ ఉన్నారు.

చేరువైన దూరవిద్య

- దూరవిద్య ప్రవేశాల సంఖ్యలో గణనీయ వృద్ధి
- సెమిస్టర్ విధానంలో పరీక్షల ప్రక్రియ
- ఆన్‌లైన్‌లో విద్యార్థులకు సమర్థ సేవలు

ఏయూక్యాంపస్: అందుబాటులో ఉన్న సాంకేతికతను అనుకూలంగా మార్చుకుంటూ.. ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం తన సేవలను విద్యార్థులకు మరింత చేరువ చేస్తోంది. మారుమూల గ్రామాల నుంచి అంతర్జాతీయంగా పలు దేశాలకు విస్తరిస్తోంది. మొత్తం మీద కొన్నేళ్లుగా దూరవిద్య కేంద్రం ప్రాశస్త్యం పెరుగుతోంది. తాజాగా ఆన్‌లైన్‌లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించారు. సెమిస్టర్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఒక్క క్లిక్‌తో సమస్త సేవలు :
ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యలో ప్రవేశాల నుంచి పరీక్షల వరకు సమస్త సేవలను ఒక్క క్లిక్‌తో పొందేలా అధికారులు చర్యలు చేపట్టారు. దూర విద్య కేంద్రానికి రాకుండానే విద్యార్థి తను ఉన్న ప్రాంతం నుంచే https://www.andhrauniversity-sde.com/ను సందర్శించి నేరుగా ప్రవేశం పొందవచ్చు. ఏటా అకడమిక్ ఈయర్‌గా జూలై, క్యాలెండర్ ఈయర్‌గా జనవరిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ప్రవేశాల నుంచి కోర్సు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తారు. విద్యార్థి ప్రవేశం పొందే సమయంలోనే ఫీజులు సైతం చెల్లించి, నేరుగా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పించారు. ప్రతి విద్యార్థికీ ఒక లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను అందిస్తారు. ప్రవేశం పొందిన తర్వాత విద్యార్థి తన లాగిన్ నుంచి నేరుగా సిలబస్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు.

వాట్సాప్ గ్రూప్‌ల ఏర్పాటు : ప్రతీ కోర్సులో 30 మార్కులకు అసైన్‌మెంట్, 70 మార్కులకు వార్షిక పరీక్ష ఉంటాయి. అసైన్‌మెంట్‌కు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సైతం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే ప్రవేశాలు పొందిన విద్యార్థులతో వాట్సాప్ గ్రూప్‌లు రూపొందించి, సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి అన్ని కోర్సులకు సెమిస్టర్ విధానం అమలు చేయనున్నారు. పరీక్షల్లో పారదర్శకత పెంచడానికి ఓఎంఆర్ విధానం అమలు చేస్తున్నారు.

డిగ్రీ విద్యార్థులకు అప్రెంటిస్
బీఏ, బీకాం దూరవిద్యలో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్టైఫండ్‌తో కూడిన అప్రెంటిస్ అందించే దిశగా అధికారులు పనిచేస్తున్నారు. వివిధ పరిశ్రమలతో అనుసంధానం చేసుకుని, వీరికి వేతనంగా కూడిన శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. వచ్చే నెలలో ప్రవేశం పొందే విద్యార్థుల నుంచి అన్ని కోర్సులకు గ్రేడింగ్, సెమిస్టర్ విధానం అమలు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏయూ దూర విద్యాకేంద్రానికి 98కి పైగా పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచి విద్యార్థి ప్రవేశం పొందినా.. సమీపంలోని పరీక్షల కేంద్రాలనే కేటాయిస్తారు.

ఆన్‌లైన్‌లో కోర్సులు



విదేశీ విద్యార్థులకు సైతం చదువుకునే వెసులుబాటు కల్పించారు. ప్రస్తుతం ఎం.ఏ సోషియాలజీ, బీకాం కోర్సులు ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. త్వరలో ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంకాం కోర్సులను సైతం ఆన్‌లైన్‌లో నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఏయూ దూరవిద్య కేంద్రం సామాజిక బాధ్యతగా ఖైదీలు, దివ్యాంగులకు ఉచితంగా విద్య అందిస్తోంది.



ఏయూ దూరవిద్య కేంద్రం

దూరవిద్య కేంద్రంలో ఐదేళ్లుగా ప్రవేశాలను పరిశీలిస్తే.. నూతన విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది.

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య
2018-19	10,292
2019-20	16,200
2020-21	15,151
2021-22	21,751
2022-23	30,566

2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల సంఖ్యను రెట్టింపు చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

నూతన విధానాలతో సత్ఫలితాలు



అధిక శాతం మందికి దూర విద్యను చేరువ చేసే విధంగా నూతన విధానాలు అమలు చేస్తున్నాం. ప్రస్తుతం అమలు చేస్తున్న ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాల ప్రక్రియకు మంచి ఆదరణ లభిస్తోంది. విద్యార్థులకు వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– ఆచార్య కె.విశ్వేశ్వరరావు, సంచాలకుడు, ఏయూ దూరవిద్య కేంద్రం

ఇంటి నుంచే సేవలు పొందొచ్చు



సాంకేతికతను ఉపయుక్తంగా మార్చుకోవడంలో ఏయూ ముందుంటుంది. విద్యార్థి దూరవిద్య కేంద్రానికి రాకుండా ఇంటి వద్ద నుంచే ప్రవేశం పొందడం, పరీక్ష ఫీజుల వరకు అన్నీ చెల్లించే అవకాశం కల్పించాం. విద్యార్థి స్టడీ మెటీరియల్ కూడా ఆన్‌లైన్‌లో నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

–ఆచార్య ఎం.వి.ఎస్ చంద్రశేఖర్, అనుబంధ ప్రొఫెసర్, ఏయూ దూరవిద్య కేంద్రం

స్వీయశక్తి సామర్థ్యాలపై నమ్మకంతోనే గెలుపు



గెలుపొందిన క్రీడాకారులతో శ్రావణ్‌కుమార్

ఉత్సాహంగా ముగిసిన 'యువ ఉత్సవ్ – 2023'

అనకాపల్లి టౌన్: స్వీయశక్తి సామర్థ్యాలపై నమ్మకం ఉన్నవారు పోటీల్లో విజేతలుగా నిలుస్తారని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ పి.శ్రావణ్‌కుమార్ అన్నారు. గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ×యువ ఉత్సవ్ – 2023₹ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోటీల ముసుగులో సృజనాత్మకత విలువలు మరవొద్దని సూచించారు. పోటీలు సృజనాత్మకత వెలికితీసేందుకు దోహదపడతాయని, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవడానికి సహాయకారిగా ఉపయోగపడుతుందని చెప్పారు. పోటీల్లో పాల్గొనే ఔత్సాహికులు తమలో దాగిన సామర్థ్యాన్ని సరైన రీతిలో ఉపయోగిస్తే కఠిన శిలల మధ్యే విశాల హర్మ్యాలు నిర్మించవచ్చని వివరించారు. పేదరికం నుంచి సంపదలు సృష్టించవచ్చన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు, క్రీడల మంత్రిత్వ శాఖ ఎస్.వై.కే రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, గౌరీ గ్రంథాలయం సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి సీఎం కృషి

మాడుగుల రూరల్: మైనార్టీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని ముకుందపురంలో మండల కోఆప్షన్ సభ్యురాలు షేక్ అహ్మద్ ఉన్నీసాతోపాటు రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీ ఐ.హెచ్. ఫారుక్, విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల మైనార్టీల కోఆర్డినేటర్ బర్కత్‌ఆలీ, అనకాపల్లి జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఖాజ్ ఉద్దీన్‌బాబా, సీనియర్ కార్యవర్గ సభ్యుడు గౌస్ ఆదివారం డిప్యూటీ సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్‌కే సాథ్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ప్రధానంగా ఉర్దూ భాషకు రాష్ట్ర అధికార ద్వితీయ హోదా కల్పించడం, హజ్ మక్కా యాత్రకు 2022–23 సంవత్సరంలో 1,164 మందికి రూ.5.52 కోట్ల సాయాన్ని అందించడం, రాజకీయాల్లో సముచిత స్థానం ఇవ్వడంతో వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీను, సర్పంచ్ కర్రి గణేష్, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం పాల్గొన్నారు.



ముకుందపురంలో బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ముస్లింలు

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం : ఖరగ్‌పూర్ డివిజన్, ఖరగ్‌పూర్ – భద్రక్ సెక్షన్, బహనగర బజార్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ట్రాక్ నిర్వహణ పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు మార్పులను గమనించి సహకరించాలని కోరారు. హౌరా – ఎస్ఎంవీ బెంగళూరు (22863) ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు – హౌరా (22864) ఎక్స్‌ప్రెస్, అగర్తలా – ఎస్ఎంవీ బెంగళూరు (00636) ఎక్స్‌ప్రెస్‌లను 26న రద్దు చేశారు.

పలు రైళ్ల గమ్యం కుదింపు
వాల్తేర్ డివిజన్, కేకే లైన్ పరిధిలో భద్రతా కారణాల వల్ల ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

- విశాఖపట్నంలో రోజూ రాత్రి బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 25 నుంచి జూలై 1 వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- కిరండూల్‌లో రోజూ రాత్రి బయల్దేరే కిరండూల్ – విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 26 నుంచి జూలై 2 వరకు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నంలో రోజూ బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ జూన్ 25 నుంచి జూలై 2 వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- కిరండూల్‌లో రోజూ బయల్దేరే కిరండూల్ – విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు జూన్ 26 నుంచి జూలై 3 వరకు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

సాగుకు సై

- మన్యంలో విస్తారంగా వర్షాలు
- చేతికందిన రైతు భరోసా సాయం
- ముందస్తుగానే విత్తనాల పంపిణీ
- ఉత్సాహంగా పొలం పనులు



దుక్కి పనుల్లో గిరిజన రైతులు

ముంచంగిపుట్టు: విశాఖ మన్యంలో గిరిజన రైతులు సాగుబాట పట్టారు. గత కొద్ది రోజులుగా మన్యం అంతట విస్తారంగా వర్షాలు పడుతుండటంతో వాగులు వంకల్లో నీరు చేరింది. దీంతో గిరిజన రైతులు పొలం పనులలో నిమగ్నం అయ్యారు. వ్యవసాయం చేయడానికి అవసరమైన వర్షాలు పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ వ్యవసాయం పై పూర్తి దృష్టి సారించారు. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని కనీసం పట్టించుకోకపోవడంతో రైతులు నానా అవస్థలు పడేవారు. వ్యవసాయం చేసేందుకు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. నెలలు తరబడి అప్పులు ఇచ్చే వారి కోసం తిరగాల్సి వచ్చేది. ఇంట్లో ఉన్న వస్తువులను తాకట్టు పెడితే గాని డబ్బులు చేతికి అందని పరిస్థితి దాపరించేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాయి. వ్యవసాయాన్ని పండగలా మార్చింది. అన్నదాతకు అండగా నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకొచ్చారు. దీంతో రైతుల కష్టాలు తీరాయి.

పెట్టుబడి కోసం రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం, వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు వ్యవసాయ అధికారులు ముందస్తుగానే పంపిణీ చేయడంతో పాటు రైతు భరోసా కేంద్రంలో నాణ్యమైన విత్తనాలు అందించారు.

దీనికి తోడు వర్షాలు సైతం సకాలంలో కురుస్తుండడంతో గిరిజన రైతులకు అన్ని రకాల కలిసి వచ్చింది. దీంతో మన్యంలో అధిక శాతం రైతులు వ్యవసాయంపై దృష్టి పెట్టి పొలం బాట పట్టారు. అన్ని కలిసొచ్చిన వేల గిరిజన రైతులు రెట్టింపు ఉత్సాహంతో నాగలి చేతపట్టి దుక్కులు మొదలు పెట్టారు. మరి కొంతమంది రైతులు దుక్కులు పూర్తి చేసుకొని పొలాల్లో ఎరువులను చిమ్ముకొనే పనిలో మునిగిపోయారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



ప్రభుత్వం అందించిన రైతు భరోసా సొమ్ము వ్యవసాయంలో పెట్టుబడికి ఎంతో ఉపయోగపడింది. గతంలో వ్యవసాయం చేయాలంటే పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ భయం లేదు. జగనన్న ప్రభుత్వానికి ఎప్పుడు రుణపడి ఉంటాం. రామ్మూర్తి, రైతు, బీటా గ్రామం, ముంచంగిపుట్టు మండలం

రైతులకు ప్రోత్సాహం



ప్రభుత్వం వ్యవసాయానికి కావల్సిన ప్రోత్సాహాలు గిరిజన రైతులకు అందించడంతో గతంలో కంటే వ్యవసాయం ఎక్కువ మంది చేస్తున్నారు. రైతులకు కావల్సిన విత్తనాలు ఇప్పటికే సరఫరా చేశాం. ఆర్‌బీకే కేంద్రాలను పూర్తిగా వినియోగించుకోవాలి.

– ముజ్జాడ శ్రీనివాస్‌బాబు, ఏవో, ముంచంగిపుట్టు మండలం

గిరిజన యువతి అదృశ్యం



చింతపల్లి : మండలంలోని కుడుముసారెకు చెందిన గిరిజన యువతి అదృశ్యమైనట్టు స్థానిక ఎస్‌ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన మర్రి సొప్పాయి(27) ఈ నెల 19న బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి కనిపించకుండా పోయినట్టు తండ్రి వీరయ్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఆచూకీ తెలిసిన వారు 9440904238కు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

కాయిన్ గేమ్ ఆడుతున్న 11 మంది అరెస్టు



పట్టుబడిన వారితో పోలీసులు

మాకవరపాలెం : కాయిన్ గేమ్ ఆడుతున్న 11 మందిని అరెస్టు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని తూటిపాల శివారు తోటల్లో కాయిన్ గేమ్ నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో ఆదివారం సాయంత్రం సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో మండలంలోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన 11 మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి 11 బైక్‌లు, రూ.25,120 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

మాకవరపాలెం : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని తూటిపాల శివారులో ఉన్న గుండుబాడు గెడ్డతోపాటు పక్కనే ఉన్న జిరాయితీ భూముల్లో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో రెండు ట్రాక్టర్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. వీటిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్

ఎస్.రాయవరం : నర్సీపట్నం రోడ్డు రేగుపాలెం రైల్వేస్టేషన్ల మధ్య ఏదో గుర్తు తెలియని రైలు నుంచి యువకుడు జారిపడి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్ ఆదివారం తెలిపారు. విశాఖపట్నం వైపు వెళ్లే రైలు మార్గంలో బ్లూ చొక్కా, జీన్ ప్యాంటు ధరించి ఉన్న సుమారు 30 ఏళ్ల వయస్సు గల యువకుడు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచినట్టు తెలిపారు. సెల్ ఫోన్ వివరాల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

స్విమ్మింగ్ పోటీలకు విశేష స్పందన

రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు ఎంపిక



ఈతపోటీల్లో పాల్గొన్న పిల్లలు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట డావిన్సీ అంతర్జాతీయ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఈత పోటీలకు విశేష స్పందన లభించింది. అనకాపల్లి జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వారు నర్సరావుపేటలో వచ్చే నెల 8,9 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సుందరరావు, సీహెచ్ దేముడులు తెలిపారు. కేటగిరి–3 బాలికల విభాగంలో లహరి,మోక్షిత,మేఘవర్ష, బాలుర విభాగంలో హర్షిల్ క్రిష్, పద్మాకర్, కేటగిరి –2 బాలికల విభాగంలో వైశాలి,మహేశ్వరి,హాసిని, బాలుర విభాగంలో ధనుష్, అప్పలనాయుడు, శ్రీరాజ్ విజేతలుగా నిలిచారని చెప్పారు. కేటగిరి–1 బాలికల విభాగంలో మధు దీపిక,కీర్తిలు విజయం సాధించారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీ లకు అర్హత సాధించారని చెప్పారు. విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి చంద్రశేఖర్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



మచ్చమ్మ(ఫైల్)

చీడికాడ : కనిపించకుండా పోయిన మహిళ ఆచూకీ తెలపాలని ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని తునివలసకు చెందిన గంట్ల మచ్చమ్మ(45) శనివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయిందన్నారు. కుటుంబ సభ్యులు వెతకగా ఎటువంటి ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440904210 సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ది విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు
వ్యాపార లక్ష్యం రూ.7728 కోట్లు



మహాజన సభలో మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు

మద్దిలపాలెం : ది విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో రూ.7,728.43 కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నామని బ్యాంకు అధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు పేర్కొన్నారు. బ్యాంకు 108వ మహాజన సభ మద్దిలపాలెంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ రూ.4,350 కోట్ల డిపాజిట్లు సేకరించాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. అదేవిధంగా రూ.3,378 కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. కాగా 2022 – 23 ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదికలో భాగంగా రూ.3,929 కోట్ల డిపాజిట్లు సేకరించగా, రుణాలు రూ.3,050 కోట్లు ఇచ్చామన్నారు. దీంతో వ్యాపారం రూ.7,026 కోట్లు సాగిందని వివరించారు. బ్యాంకు సభ్యులు 92,831 మంది కాగా షేర్ ధనం రూ.305 కోట్లు నమోదయిందన్నారు. దీంతో దేశంలో నాలుగో స్థానంలో నిలిచిందని ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.73.14కోట్లు లాభాలు ఆర్జించామని పేర్కొన్నారు. బ్యాంకు రిజర్వ్‌నిధి రూ.389 కోట్లుకాగా ఆస్తులు రూ.179 కోట్లని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వాల సెక్యూరిటీలు, ఇతర బ్యాంకులలో పెట్టుబడులు రూ.1620 కోట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. మానం ఆంజనేయులు మాట్లాడుతూ సహకార బ్యాంకులపై రిజర్వ్ బ్యాంకు అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సహకార రంగంలో సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన విశ్వనాథన్ కమిటీ సిఫార్సులు, జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలన తర్వాత ప్రస్తుతం చట్టంచేసే దశలో ఉందని తెలిపారు. బ్యాంకుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ పాలక వర్గం ఆలోచనలు చేయాలని సూచించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సీనియర్ వైస్ చైర్మన్ బి.భాస్కరరావు, బ్యాంకు డైరెక్టర్లు ఎస్.నాగభూషణం, జె.వి.సత్యనారాయణ మూర్తి, ఎ.జె.స్టాలిన్, ఎస్.కామరాజు, కె.భవాని పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి బేడామండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శత నామావళి పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు కల్యాణం నిర్వహించారు.